సాక్షి
ఏలూరు

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



ఫస్ట్ వస్తే అవస్థలే
ఫస్టు వస్తే చాలు పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అవస్థలు పడుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్నా సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. 8లో ▸



నారాయణ స్కూల్లో దారుణం
పాలకొల్లు నారాయణ స్కూల్లో ఓ చిన్నారి హార్పిక్ పౌడర్ తినేయడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. 8లో ▸



గుర్రపుడెక్క.. తీసేయాలి పక్కా
గుర్రపుడెక్క కొల్లేరు గ్రామాలకు వణుకుపుట్టిస్తోంది. తీసేకొద్దీ రెట్టింపుగా కొట్టుకొస్తోంది. ఏమీ చేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. 8లో ▸

రాజన్నా.. నీ జ్ఞాపకాలు పదిలం



2009 సెప్టెంబరు 2..
పేదల ఆశాదీపం ఆరిపోయిన చీకటి రోజు.. కొండంత అండ కరిగిపోయిన రోజు..
నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లెమ్మా.. నమస్తే.. నమస్తే. నమస్తే బాబు.. నమస్తే పాప.. నమస్తే.. నమస్తే.. నమస్తే అన్న ఆత్మీయ పిలుపు దూరమైన రోజు.. రాజన్న ఈ లోకాన్ని వీడి తిరిగిరాని లోకాలకు తరలిపోయిన రోజు..

పేద బతుకులకు భరోసాను కల్పించిన మహానేత దివికేగి అప్పుడే 16 ఏళ్లు గతించిపోయినా ఆ చిరునవ్వు ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. ఆ ఆత్మీయ పిలుపు చెవుల్లో మార్మోగుతూనే ఉంది. నేడు వైఎస్ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా అంతటా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల నిర్వహణకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు.



పోలవరం ప్రాజెక్టు

సంక్షేమానికి చిరునామా వైఎస్సార్
కొత్త పింఛన్ రావాలంటే ఉన్న లబ్ధిదారుల్లో ఎవరు పోతారాని ఎదురుచూసే వారు కొందరైతే, సొంత గూడు కలగానే మిగిలిపోతుందనుకునే వారు మరికొందరు. జబ్బు చేస్తే వైద్యం చేయించుకోలేని, పిల్లల్ని పెద్ద చదువులు చదివించలేని పరిస్థితి. సాగు భారమై రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్న రోజులు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాకముందు పేదల దుస్థితి ఇది. 2004లో సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆయన అమలు చేసిన పథకాలు పేదలకు ఉన్నత విద్యనందించాయి. సొంతింటి కలను సాకారం చేశాయి. లక్షల ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని అందించాయి. రైతులకు వ్యవసాయాన్ని పండుగ చేశాయి. అర్హులందరికీ సంక్షేమ లబ్ధిని చేరువచేశాయి. 108, 104, పింఛన్లు, పావలా వడ్డీ, రుణమాఫీ ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు పేదవర్గాల వారి అభివృద్ధికి బాటలు వేశాయి.

- పశ్చిమను సస్యశ్యామలం చేసిన మహానేత వైఎస్సార్
- ఎత్తిపోతల పథకాలతో సాగుకు ప్రాధాన్యం
- ఉద్యాన వర్సిటీ, నూజివీడు ట్రిపుల్ ఐటీతో వెలుగు రేఖలు
- గిరిజనులకు పోడు భూముల పంపిణీ
- నేడు వైఎస్సార్ వర్ధంతి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పచ్చగా ఉండాలని వైఎస్సార్ పరితపించారు. సాగు నీటి కష్టాలు తీరిస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని భావించి ఆ దిశగా అడుగులు వేశారు. సాగునీటి ప్రాజెక్టులు, నూజివీడు ట్రిపుల్ ఐటీ, ఉద్యాన వర్సిటీ ఇలా అనేక కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి పూర్తి చేసిన ఘనత ఆయనదే. నేడు దివంగత వైఎస్సార్ వర్ధంతి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతో ఆయన అనుబంధం ఒకసారి గుర్తు చేసుకుందాం.

సాగుకు పట్టం : జాతీయ ప్రాజెక్ట్ పోలవరం మొదలుకొని వందల కోట్ల వ్యయంతో అనేక ఎత్తిపోతల పథకాలకు ముఖ్యమంత్రి హోదాలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. 2004లో పోలవరం ప్రాజెక్ట్‌కు శంఖుస్థాపన కుడి, ఎడమ కాలువలు దాదాపు 60 శాతం పనులు ఆయన హయాంలోనే కొనసాగాయి. మళ్లీ 2019 నుంచి 2024 వరకూ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రాజెక్ట్ పనులను పరుగులు పెట్టించారు. వైఎస్సార్ హయాంలో రూ.58 కోట్లతో కొవ్వాడ కాలువపై అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మించారు. బుట్టాయగూడెం, కొయ్యలగూడెంలో రూ.26 కోట్లతో 7500 ఎకరాలకు సాగునీరు అందించే పోగొండ రిజర్వాయర్ నిర్మాణం, రూ.26 కోట్లతో కొండ కాలువ వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం వైఎస్సార్ హయంలోనే జరిగాయి. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి 2008 అక్టోబర్ 30న కామవరపుకోటలో శంకుస్థాపన చేశారు. ఆయన మరణానంతరం పాలకులు విస్మరించడంతో చింతలపూడి ప్రాజెక్ట్ సాకారం కాలేదు. చింతలపూడి పూర్తయితే 5 లక్షల ఎకరాలకు పూర్తిగా సాగునీరు అందడంతోపాటు 2.10 లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా నీరు అందేది.

వర్సిటీలతో జిల్లా ఖ్యాతి పెంపు
ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో దేశంలోనే 2వ హార్టికల్చర్ యూనివర్శిటీకి శ్రీకారం చుట్టారు. ఈ యూనివర్శిటీ 14 ఉద్యానవన పంటలకు సంబంధించి 23 రకాల వంగడాలను సిద్ధం చేసి రైతులకు అందిస్తోంది. కొత్త కొబ్బరి వంగడాలకు శ్రీకారం చుట్టి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మొక్కలను పంపిణీ చేస్తున్నారు. కోస్తా జిల్లాలోని విద్యార్థుల కోసం 120 ఎకరాల విస్తీర్ణంలో ట్రిపుల్ ఐటీ కళాశాలను ఏర్పాటు చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీతో జిల్లాకు వెలుగు రేఖలు తీసుకువచ్చారు. ట్రిపుల్ ఐటీ ఏర్పడ్డాక ఇంతవరకూ 12 బ్యాచ్‌ల్లో 6 వేల మందికిపైగా విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో కొలువులు, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎంలో విద్యావకాశాలు లభించాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులే పనిచేస్తున్నారు. 120 ఎకరాల విస్తీర్ణంలో కార్పొరేట్ భవనాలను తలదన్నే రీతిలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్‌కు శ్రీకారం చుట్టి ఏటా 2 వేల మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేలా ప్రారంభించారు.

గిరిజనులకు అండగా..
గిరిజనులకు పోడు భూముల మీద హక్కులు కల్పించి సాగును ప్రోత్సహించారు. దాన్నే ఆయన తనయుడు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొనసాగించారు. 2004–09లో ఏజెన్సీ ప్రాంతంలో 4,500 ఎకరాల పోడు భూములను 2,200 మంది గిరిజనులకు పంపిణీ చేశారు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గిరిజనులకు శాశ్వత భూ హక్కు కల్పించి 2,700 మంది గిరిజనులకు 3,500 ఎకరాల పోడు భూమిని పంపిణీ చేసి 350 ఉచిత బోర్లను ఏర్పాటు చేశారు. ఏలూరు నగర ముంపునకు తమ్మిలేరు రిటైనింగ్ వాల్‌తో పరిష్కారం చూపారు. ఆయన హయాంలో కొంత మేరకు పనులు నిర్వహించగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిర్మాణం పూర్తయ్యింది.

రైతు బాంధవుడు వైఎస్



దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. నాలాంటి చిన్న రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన సందర్భంలో వరుసగా రెండేళ్ళ పాటు పంట నష్టపరిహారం, బీమా పరిహారం అందించారు. ప్రస్తుత ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టకపోవడంతో నాలాంటి రైతులు సేద్యానికి దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.
– అబ్దుల్ జబ్బార్, రైతు, అల్లినగరం

న్యూస్‌రీల్

ఆక్యుపేషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు

ఏలూరు టౌన్: హైకోర్టు ఉత్తర్వుల మేరకు నగరంలో నిర్మించిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ భవనానికి ఆక్యుపేషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు కోరారు. నగర కమిషనర్ ఏ.భానుప్రతాప్‌ను సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్, పార్టీ నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి ఆక్యుపేషన్ సర్టిఫికెట్ మంజూరుకు అనుమతులు ఇవ్వాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి తదితరులు ఉన్నారు.

అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

ఏలూరు(మెట్రో): కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టరు పి.ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేసి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు ఆ విషయాన్ని ఫిర్యాదుదారులతో మాట్లాడితే వారికి కొంత ఊరట కలుగుతుందన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోవి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్సు చేసి పంపాలన్నారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి
పోలవరం రూరల్: గోదావరి వరద స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరే నీరు తగ్గుతుండటంతో వరద ప్రవాహం తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 33 మీటర్లకు వరద నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 10.73 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. భద్రాచలం వద్ద 43.40 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న టాటా మ్యాజిక్ డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆటో, టాటా మ్యాజిక్, క్యాబ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ధర్నాని ఉద్దేశించి ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే పోలారి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల టాటా మ్యాజిక్ సర్వీస్ ఆదాయం తీవ్రంగా దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో, టాటా మ్యాజిక్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని. నెలకు రూ.3000 పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాలగూడెం హత్య కేసులో పురోగతి
ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ మండలం పాలగూడెం వైఎస్సార్ కాలనీలో పునూరు రాజేష్‌పై ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కత్తులతో దాడిచేసి హత్య చేశారు. ఈ హత్య కేసులో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా.. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. బూరుగు నాని అలియాస్ చిన్ని నాని, బాలుతో పాటు మరో ఇద్దరు హత్యకేసులో పాత్రధారులుగా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పోలీస్ అధికారులు ఆ నలుగురిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. హత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు చెబుతున్నారు.

అగ్గిపుల్లపై వైఎస్సార్ చిత్రం



దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు అగ్గిపుల్లపై ఆయన చిత్రాన్ని రూపొందించి నివాళులర్పించారు. వైఎస్సార్ పక్కనే ఆయన తనయుడు వైఎస్ జగన్ చిత్రాన్ని కూడా రూపొందించి అభిమానాన్ని చాటుకున్నారు.
– ఏలూరు (టూటౌన్)

తమ్మిలేరు ఉగ్రరూపం

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

చింతలపూడి: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. సోమవారం ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 5,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం 349 అడుగులకు, గోనెలవాగు బేసిన్ 348.88 అడుగులకు చేరుకుంది. ఖమ్మం జిల్లా బేతుపల్లి అలుగు పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 7,000 క్యూసెక్కుల నీరు అంధ్రా కాల్వ ద్వారా ప్రాజెక్టులోకి వస్తోందని ఏఇ లాజర్‌బాబు తెలిపారు. శివపురం, చిన్నంపేట గ్రామాల మధ్య కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

6 వేల క్యూసెక్కులు విడుదల
ఏలూరు(మెట్రో): తమ్మిలేరు వరద నేపథ్యంలో నాగిరెడ్డి డ్యామ్ నుంచి దిగువ ప్రాంతాలకు 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. నీటిమట్టం పెరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సహాయం కావాలన్నా 112కు కాల్ చేయాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎస్పీ కె.కిషోర్ కోరారు. పోలీస్ శాఖ పూర్తి సిద్ధంగా ఉందని తెలిపారు.



తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి ఏలూరు వైపు ఉరకలు వేస్తున్న వరద

నిలిచిన రాకపోకలు
చాట్రాయి: మండలంలోని చిన్నంపేటలో తమ్మిలేరు వరద వంతెనను తాకి ప్రవహిస్తోంది. ఇదే గ్రామం వద్ద డైవర్షన్ ద్వారా సీకే పాడు చానల్‌కు వరద ప్రవహిస్తుండడంతో చిన్నంపేట, కోటపాడు గ్రామాల్లోని చెరువులకు భారీగా వరద నీరు చేరింది.

రేషన్ తిప్పలు
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటికే వచ్చి రేషన్ బియ్యం ఇచ్చే వారు. కూటమి ప్రభుత్వంలో పాత కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. పడిగాపులు పడుతూ రేషన్ తీసుకునే దుస్థితిని కూటమి ప్రభుత్వం కల్పించింది. పడిగాపులు పడి, రేషన్ బియ్యం బస్తాని ఇంటికి మోసుకెళ్లే పరిస్థితి రావడం వృద్ధులకు సవాల్‌గా మారింది. వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ అని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. వృద్ధులు కూడా క్యూలో నిలబడి రేషన్ తీసుకెళ్లాల్సిందే. ఈ నరకం ఇంకెన్నాళ్లని వృద్ధులు వాపోతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్



ఏలూరు లంకపేట రేషన్ షాపు వద్ద బారులు తీరిన వృద్ధులు, మహిళలు

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

క్లుప్తంగా

మద్దిలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవాల్లో భాగంగా మద్దిక్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో తొలి రోజు ఆంజనేయ స్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనము, మృత్సంగ్రహణ, అంకురార్పణ, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, అకల్మష హోమాలు, ఏతత్ ప్రధాన హోమాలు నిర్వహించినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు. అలాగే రెండవ రోజు మంగళవారం నిత్యకైంకర్యాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో చెప్పారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

చింతలపూడి : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర కౌన్సిలర్ కంచర్ల బుచ్చిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడకు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి.కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

3న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు రాక

ఏలూరు (టూటౌన్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల మూడో తేదీన ఏలూరు రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ సోమవారం విలేకరులకు తెలిపారు. బుధవారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం వరకు ఏలూరులో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం నాలుగు గంటలకు మీడియాతో ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: ద్విచక్ర వాహనంతో చెట్టును ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కన్నాపురం గ్రామ శివారున సోమవారం చోటు చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం గ్రామానికి చెందిన అయినపుడి సత్యనారాయణ (60) ద్విచక్రవాహనంపై బుట్టాయిగూడెం మండలం కండ్రికగూడెంలో బంధువు రెడ్డి వెంకట్రావు ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ కన్నాపురం శివారు వచ్చేసరికి చెట్టును ఢీకొన్నారు. దీంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే సత్యనారాయణ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.



పింఛన్ తెచ్చుకోవాలిగా : ఏలూరులో సచివాలయానికి పింఛన్ తీసుకునేందుకు రిక్షాపై వెళుతున్న వృద్ధులు



సమాధానం చెప్పేవారు లేరు : చోడిదిబ్బ సచివాలయం సిబ్బంది లేక ఖాళీగా ఉన్న దృశ్యం



ఇంటికేగా పింఛన్ : ఏలూరు కొత్తపేట సచివాలయంలో పింఛన్ల అందజేత

ఫస్ట్ వస్తే అవస్థలే

ఫస్ట్ తారీఖు వస్తే చాలు పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నానా అవస్థలు పడుతున్నారు. పింఛన్ ఇవ్వడానికి సిబ్బంది ఎప్పుడొస్తారో అని ఎదురుచూసి.. రాకపోయే సరికి నడవలేని స్థితిలో ఉన్నా అవస్థ పడి మరీ సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. తీరా అక్కడికి వెళ్తే సమాచారం చెప్పే వారు లేకపోవడంతో పడిగాపులు పడుతున్నారు. దీనికి తోడు సచివాలయ సిబ్బందిని కూటమి ప్రభుత్వం ఇష్టానుసారం బదిలీలు చేయడం, పింఛన్‌దారుల అడ్రస్‌లు తెలియక వెతికే ఉద్యోగులు కొందరైతే, వాళ్లే వస్తారులే అని ధీమాగా కూర్చొనే ఉద్యోగులు కొందరు మరో వైపు ఉన్నారు. ఇంటింటికీ వచ్చి తలుపు కొట్టి పింఛన్ ఇచ్చే ప్రభుత్వాన్ని కాదని, ఇలా గుమ్మంలో ఎదురుచూపులు, సచివాలయాల చుట్టూ తిరిగే అవస్థలు కోరి తెచ్చుకున్నామని లబ్ధిదారులు ఘొల్లుమంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



సచివాలయానికి వెళ్లాల్సిందే..



సచివాలయం గుమ్మంలో పింఛన్ కోసం పడిగాపులు



పింఛన్ ఇవ్వాలి : సిబ్బంది కోసం వృద్ధుడి ఎదురుచూపులు



వీధిలోనే ఎదురుచూపులు : పింఛన్ లబ్ధిదారుల పడిగాపులు



నడవలేని స్థితిలో సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు

గుర్రపుడెక్క.. తీసేయాలి పక్కా..

- పెదఎడ్లగాడి వంతెన 56 ఖానాలకు చేరిన డెక్క
- పెనుమాకలంక రహదారిలో రెండు చోట్ల గండి
- భయాందోళనలో కొల్లేరు గ్రామాల ప్రజలు



మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన వద్ద ఖానాలకు పేరుకుపోయిన గుర్రపుడెక్క



పెనుమాకలంక చేరే రహదారిపైకి చేరిన కొల్లేరు వరద నీటిలో ప్రమాదకర ప్రయాణం

కైకలూరు: గుర్రపుడెక్క కొల్లేరు గ్రామాలకు వణుకుపుట్టిస్తోంది. తీసేకొలది ఎగువ నుంచి రెట్టింపుగా కొట్టుకొస్తోంది. ఏమీ చేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వరద నీరు బుడమేరు, తమ్మిలేరు, రామి లేరు, గుండేరు వంటి భారీ డ్రెయిన్లతో పాటు మరో 31 మీడియం, మైనర్ డ్రెయిన్లు, కాలువలు చానల్స్ ద్వారా పెద్ద ఎత్తున కొల్లేరుకు చేరుతుంది. వరదల సమయంలో 1,10,920 క్యూసెక్కులు కొల్లేరుకు వస్తుందని అంచనా. వీటిలో కేవలం 12 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ఉప్పుటేరు ద్వారా 62 కిలోమీటర్లు ప్రయాణించి బంగాళాఖాతం చేరుతుంది. ఈ మార్గంలో గుర్రపుడెక్క అనేక చోట్ల పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతోంది.

పెద్ద సమస్యగా పెదఎడ్లగాడి వంతెన

కొల్లేరుకు చేరే నీటిని సముద్రానికి పంపించే క్రమంలో మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన ప్రధాన భూమిక పోషిస్తోంది. వంతెనకు 56 ఖానాలు ఉన్నాయి. ఇటీవల పొక్లెయిన్లతో డెక్కను తీయించారు. కొద్ది రోజులకే తిరిగి మరింతగా ఎగువ నుంచి డెక్క కొట్టుకువచ్చింది. ప్రస్తుతం వంతెన మొత్తం ఖానాలన్నింటిలోనూ డెక్క పట్టేసింది. దీంతో నీటి ప్రవాహం మందగిస్తోంది. ఆదివారం పెదఎడ్లగాడి వంతెన వద్ద 2.5 మీటర్ల నీటి మట్టం నమోదైంది. ఇది 4 మీటర్లు దాటితే ప్రమాదకరం. తెలంగాణలో విస్తార వర్షాల కారణంగా ఖమ్మం జిల్లా నుంచి నీరు కొల్లేరుకు చేరుతోంది. దీంతో కొల్లేరు గ్రామాలు భయాందోళన చెందుతున్నాయి.

తమ్మిలేరు నుంచి 934 క్యూసెక్కుల నీరు

తెలంగాణ రాష్ట్రంలో విస్తార వర్షలతో వరద నీరు తమ్మిలేరు జలాశయానికి చేరుతోంది. ప్రస్తుతం 1,500 క్యూసెక్కుల నీరు నిల్వ ఉంది. దీని నుంచి 934 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ నీరు ఏలూరు, తంగెళ్లమూడి మీదుగా కొల్లేరుకు చేరుతోంది. అక్కడ మండవల్లి మండలం పెదఎడ్లగాడి మీదుగా ఉప్పుటేరుగా చేరి సముద్రానికి చేరాలి. ప్రస్తుతం తెలంగాణలో మరోసారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆ నీరు కూడా తోడైతే తమ్మిలేరులో నీటి మట్టం 2,000 క్యూసెక్కులకు చేరుతోంది. అప్పుడు తప్పని పరిస్థితుల్లో వరద నీటిని కొల్లేరుకు వదలాలి. ఇదే జరిగితే గుర్రపుడెక్క అడ్డు కారణంగా కొల్లేరు గ్రామాలు నిండా నీటిలో మునుగుతాయి.

పెనుమాకలంక రహదారికి గండ్లు

ఎగువ నుంచి భారీగా చేరిన గుర్రపుడెక్క కారణంగా పెదఎడ్లగాడి వంతెన నుంచి దిగువకు వరద నీరు నెమ్మదిగా పారుతోంది. ఈ కారణంగా నీరు ఎగదన్ని మండవల్లి మండలం పెదఎడ్లగాడి నుంచి పెనుమాకలంక చేరే రహదారిలో రెండు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. ఇటీవల వర్షాలకు రహదారిలో రెండు ప్రాంతాల్లో భారీ గండ్లు పడటంతో పోలీసుశాఖ రాకపోకలను నిలుపుదల చేసింది. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు, కార్లు వెళుతున్నాయి. తెలంగాణలో వర్షాలు కారణంగా తిరిగి గండ్లు పడ్డాయి. నీటి ప్రవాహం రోజురోజుకు పెరుగుతుంది. ప్రతి ఏటా ముంపు బారిన పడుతున్నామని, శాశ్వత పరిష్కారం చూపాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన వద్దు



కొల్లేరు గ్రామాల ప్రజలు ఆందోళన చెందవద్దు. పెదఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్కను ఇటీవల తొలగించాం. పైనుంచి తిరిగి కొట్టుకొచ్చింది. నీటి ప్రవాహాన్ని బట్టి మరో పర్యాయం తొలగిస్తాం. పెనుమాకలంక రహదారిలో రెండు చోట్ల ప్రతి ఏటా గండి పడుతోంది. అక్కడ రోడ్డును ఎత్తు చేసే ఆలోచన చేస్తున్నాం. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నాం.

– ఎం.రామకృష్ణ, డ్రెయినేజీ డీఈ, కైకలూరు

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత



కుక్కునూరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కుక్కునూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తిని 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 6వ తరగతికి చెందిన 8 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తిన్న తరువాత వాంతులు అవ్వడంతో వెంటనే ఉపాధ్యాయులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సుప్రియను వివరణ కోరగా విద్యార్థుల ఆరోగ్యం బాగానే ఉందని, చికిత్స అందించిన వెంటనే పంపించివేశామని చెప్పారు. కాగా దీనిపై విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులను నిలదీశారు. భోజనం తిన్న వెంటనే వాంతులు అయ్యాయని విద్యార్థులు చెబుతుంటే, బయట నుంచి తెచ్చుకున్న బిస్కెట్‌లు తినడం వలనే విద్యార్థులకు వాంతులు అయ్యాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, సర్పంచ్ రావు మీనాతో కలిసి పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు.

కుమ్మరిగట్టులో 9 డయేరియా కేసులు



పరిసరాలను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం సమీపంలో ఉన్న కుమ్మరిగట్టు గ్రామంలో సుమారు 9 మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా మరొక ఐదుగురు జ్వరాల బారిన పడ్డారు. దీంతో నందాపురం పీహెచ్‌సీకి సంబంధించిన వైద్యులు డాక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు వైద్య సేవలు అందించారు. రోగుల్లో యండమూరి వెంకటలక్ష్మితో పాటు మీనాక్షి అనే చిన్నారిని చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం తరలించారు. ఈ వైద్యశిబిరాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అమృతం సందర్శించి గ్రామంలో డయేరియా కేసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ వైద్య శిబిరాన్ని మరో ఐదు రోజులపాటు కొనసాగించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ హరేంద్రకృష్ణ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ జె. సురేష్, సర్పంచ్ ఎం.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అస్వస్థతకు గురి కావడానికి కలుషిత నీరు కారణమా? లేక మరేదైనా ఉందా? అని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

పాలకొల్లు సెంట్రల్: తండ్రికి కుమార్తె తలకొరివిపెట్టిన ఘటన పాలకొల్లులో చోటుచేసుకుంది. పట్టణంలోని బ్రాడీపేట మూడవ వీధికి చెందిన సారిక సత్యనారాయణ (80) గత రెండేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితం కాగా సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఉండి నియోజకవర్గం కాళ్ల గ్రామంలో ఉంటున్న కుమార్తె తండ్రి సత్యనారాయణ అంతిమ సంస్కారాలు నిర్వహించింది. పెన్షన్‌తోనే జీవనం సాగించే సత్యనారాయణకు సచివాలయ సిబ్బంది ఉదయం సుమారు 8 గంటల సమయంలో పింఛన్ ఇవ్వడానికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు.

అయినవాళ్లే ఆదరించకపోతే..!



వేల్పూరులో ఇంటి బయట వేచిఉన్న నాగ త్రినాథ్

తణుకు అర్బన్: నడవలేని స్థితిలో ఉండడంతో భారమవుతాడనుకున్నారో ఏమో కానీ తండ్రి, తోడబుట్టిన సోదరులు ఇంట్లోకి రానివ్వడం లేదు. దీంతో తనను ఇంట్లోకి రానివ్వండి అంటూ ఆ యువకుడు వేడుకుంటూ రోదిస్తున్న తీరు ఆ ప్రాంతవాసులను కలచివేస్తోంది. మానవత్వాన్ని మంటకలిపే ఈ ఘటన తణుకు మండలం వేల్పూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... గ్రామంలోని సాలిపేటకు చెందిన తాడిశెట్టి నాగ త్రినాథ్ గత ఏడేళ్లుగా సింగపూర్‌లోని షిప్ యార్డులో రెస్క్యూ టీంలో ఉద్యోగిగా ఉపాధి పొంది కుటుంబంలో ఏర్పడ్డ సమస్యలతో గతేడాది జూలైలో ఇండియాకు వచ్చారు. అయితే ఇటీవల రోడ్డు ప్రమాదంలో నడుము భాగంలో తగిలిన గాయానికి కాలు కదపలేని స్థితిలో విశాఖపట్నం, విజయవాడ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. చేతిలో ఉన్న డబ్బు అయిపోగా సోమవారం ఆస్పత్రి నుంచి ఇంటికి రాగా ఇంట్లోకి రానీయకుండా తండ్రి, అన్నదమ్ములు ఇంటి తలుపులు మూసేశారు. దీంతో దిక్కుతోచక ఇంటి ముందు రోదిస్తూ ఉండిపోయారు. గతంలోనే తల్లి చనిపోగా తండ్రి తాడిశెట్టి నాగేశ్వరరావు, అన్న, తమ్ముడు ఇంట్లోకి రానీయడంలేదని చెబుతున్నారు. సింగపూర్‌లో ఉన్నంత కాలం సంపాదించిన సొమ్ము అంతా ఇంటికే పంపించానని, కానీ నేడు ఆరోగ్యం బాగోలేని సమయంలో సొంతవాళ్లే పట్టించుకోవడంలేదని త్రినాథ్ వాపోతున్నారు. నడవలేని స్థితిలో యూరిన్ బ్యాగ్‌తో వీల్‌చైర్‌లో ఉన్న త్రినాథ్ పడుతున్న ఆందోళన, ఆవేదన వర్ణనాతీతంగా మారింది. తన సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లతోపాటు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణలను సోషల్ మీడియా వేదికగా వేడుకుంటున్నారు.

నారాయణ స్కూల్లో దారుణం

- తరగతి గదిలో హార్పిక్ పౌడర్ తినేసిన ఎల్‌కేజీ చిన్నారి
- విజయవాడలో నాలుగు రోజులుగా అందిస్తున్న చికిత్స



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సహస్ర, గొంతులో కాలిన ఎండోస్కోప్ చిత్రాలు





హార్వి సహస్ర (ఫైల్), చిన్నారి తిన్న హార్పిక్ యాసిడ్ పౌడర్

పాలకొల్లు సెంట్రల్: తరగతి గదిలో ఓ చిన్నారి హార్పిక్ యాసిడ్ పౌడర్ తినేయడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన పాలకొల్లు శంభన్న అగ్రహారం ప్రాంతంలో చోటుచేసుకుంది. పట్టణంలోని స్థానిక బుధవారపు వీధి ప్రాంతానికి చెందిన మామిడిపల్లి సంయుక్త, అనుదీప్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. తమ కుమార్తె నాలుగేళ్ల చిన్నారి హార్వి సహస్ర పట్టణంలోని నారాయణ స్కూల్లో ఎల్‌కేజీ చదువుతోందని తెలిపారు. గత గురువారం స్కూల్‌కు వెళుతుండగా పాప బ్యాగ్‌లో బిస్కెట్ ప్యాకెట్ వేసి పంపించామని చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో చిన్నారికి అస్వస్థతగా ఉందని ఆసుపత్రికి తీసుకు వెళుతున్నామని స్కూల్ నుంచి ఫోన్ రావడంతో వెళ్లినట్టు చెప్పారు. అక్కడ చికిత్స చేసిన వైద్యులు ఇక్కడ కష్టమని, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించాలని సూచించారన్నారు. వెంటనే విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. అసలు విషయంపై ఆరా తీయగా స్కూల్లో ఇచ్చిన స్నాక్స్ బ్రేక్‌లో చిన్నారి బిస్కెట్ ప్యాకెట్ అనుకొని హార్పిక్ యాసిడ్ పౌడర్ తినేసిందని, దీంతో నోటి నుంచి రక్తం వచ్చినట్టు తెలిసిందన్నారు. చిన్నారి నాలుక, పేగులు, గొంతు లోపల భాగంలో కాలిపోయాయని వైద్యులు చెప్పినట్టు బాలిక తల్లి సంయుక్త కన్నీరుమున్నీరవుతూ వివరించారు. ప్రస్తుతం శరీరంలోకి పైపు ద్వారా ఓఆర్‌ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్లు, మంచినీళ్లు ఐదేసి చుక్కలు చుక్కలుగా వేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.1.50 లక్షలు ఖర్చు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో కేసు నమోదు చేయించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

తప్పించుకునే ప్రయత్నంలో బుకాయింపు

ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా మీ పాప ఆ ప్యాకెట్ తెచ్చుకుందని బుకాయిస్తున్నారని చిన్నారి తల్లిదండ్రులు వాపోయారు. సీసీ ఫుటేజీ తీయాలని అడుగుతుంటే కెమెరాలు పనిచేయడం లేదని చెబుతూ ఎదురు వాదనకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ స్నాక్స్ సమయంలో పాపకు ఇబ్బంది ఏర్పడినట్టు తెలియగానే నోరు కడిగి ఆస్పత్రికి తరలించామని, ఈ ప్యాకెట్ ఎక్కడిది అని పాపని అడిగితే ఇంటి నుంచి తెచ్చుకున్నానని చెప్పిందని సమాధానమిచ్చారు. సుమారు నెల రోజుల క్రితం ఇదే పాఠశాలలో ఓ చిన్నారిపై టీచర్ అగ్గిపుల్ల అంటించి వాత పెట్టిన ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.